కరెంట్ బిల్లుల డబ్బులు హాంఫట్

- కాజేస్తున్న లైన్‌మెన్
- ఆరు నెలలుగా ఇదేతంతు
- న్యాయం చేయాలంటూ ట్రాన్స్‌కో ఏఈకి వినియోగదారుల వినతి


మిట్టనందిమళ్ల సబ్‌స్టేషన్

అమరచింత: వినియోగదారుల నుంచి కరెంట్ బిల్లులు వసూలు చేస్తున్న ట్రాన్స్‌కో లైన్‌మెన్ వాటికి సంబంధించిన చెల్లింపు రశీదులు ఇవ్వకుండా డబ్బులను సొంతంగా వినియోగించుకుంటున్న వ్యవహారం మిట్టనందిమళ్లలో ఆదివారం వెలుగు చూసింది. మండలంలోని మిట్టనందిమళ్ల, ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లి గ్రామాలకు ట్రాన్స్‌కో లైన్‌మెన్‌గా అశోక్ ఏడాది కాలంగా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ఇందిరమ్మ గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకున్న వారికి జీరో బిల్లులు వస్తుండటంతో.. పాత బకాయిలతో పాటు 200 యూనిట్ల కన్నా ఎక్కువ విద్యుత్ యూనిట్లను వాడుకున్న వారికి కరెంట్ బిల్లు వేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ బిల్లులు వచ్చిన వారి నుంచి లైన్‌మెన్ నగదును తీసుకుంటూ.. రశీదు ఇవ్వకుండా తెల్ల కాగితం మీద రాసిస్తానంటూ నమ్మబలుకుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రతి నెల బిల్లులు కడుతున్నా.. గత బకాయిలు అంటూ రూ.వేలల్లో బిల్లులు రావడం చూసి వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై లైన్‌మెన్‌ను గ్రామస్తులు నిలదీయగా.. తాను వాడుకున్నానని సమయం ఇస్తే చెల్లిస్తానని చెప్పాడు. దీంతో మిట్టనందిమళ్ల గ్రామస్తులు ట్రాన్స్‌కో ఏఈకి లైన్‌మెన్ నిర్వాకంపై ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లైన్‌మెన్‌కు ఫోన్ పే చేశా..


లైన్‌మెన్ అశోక్ తన ఇంటికి వచ్చి కరెంట్ బిల్లు రూ.4,670 ఉందని, వెంటనే చెల్లించాలని చెప్పాడు. బకాయి డబ్బులు ఎప్పుడైనా చెల్లించాల్సిందే అనుకుని లైన్‌మెన్‌కు ఫోన్ పే ద్వారా డబ్బులను చెల్లించాను. డబ్బులు చెల్లించి ఆరు నెలల కాలం దాటుతున్నా ఇప్పటికీ నెలసరి కరెంట్ బిల్లులో పాత బకాయి అంటూ చూపెడుతుంది. అనుమానం కలిగి లైన్‌మెన్‌ను అడిగితే అవసరం ఉంటే వాడుకున్నానని, త్వరలోనే చెల్లిస్తానని చెబుతున్నాడు.
– సతీష్, మిట్టనందిమళ్ల

మీటర్‌కు డబ్బులు ఇచ్చా


ఆరు నెలల కిందట ఇంటికి కరెంట్ మీటర్ బిగించాలని కోరుతూ రూ.4 వేలు లైన్‌మెన్ అశోక్‌కు చెల్లించాను. ఇప్పటి వరకు మీటరు ఇవ్వలేదు. లైన్‌మెన్‌కు అడిగితే సమాధానం దాటవేస్తున్నాడు.
– వెంకటన్న, మిట్టనందిమళ్ల

రసీదు ఇవ్వలేదు


కరెంటు బిల్లు వసూలు కోసం వచ్చానంటే లైన్‌మెన్ అశోక్‌కు రూ.1,500 చెల్లించా. దీనికి సంబంధించి రశీదును నేటి వరకు ఇవ్వలేదు. నెల కరెంటు బిల్లులో పాత బకాయి అని వస్తుందని అడిగితే మొఖం చాటేస్తున్నాడు.
– లాల్‌కోట వెంకటన్న, మిట్టనందిమళ్ల

రూ.6,100 చెల్లించాను


ఇంటికి సంబంధించి మూడు కరెంట్ మీటర్లకు బకాయిలతో కలిపి మొత్తంగా రూ.6,100 కట్టాలని లైన్‌మెన్ తమ ఇంటికి రావడంతో.. ఇంట్లో తాను లేకున్నా కుటుంబ సభ్యులతో డబ్బులను ఇప్పించాను. చెల్లించిన డబ్బులకు రశీదులు ఇవ్వమంటే తెల్లచీటి మీద రాతలు రాసి తమ ఇంటి వారికి అందించాడు. దీనిపై లైన్‌మెన్‌ను ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెప్తున్నాడు.
– సర్వారెడ్డి, మాజీ సర్పంచ్, మిట్టనందిమళ్ల

ఉన్నతాధికారులకు విన్నవిస్తాం

మిట్టనందిమళ్ల లైన్‌మెన్ నిర్వాకం గురించి గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదును అధికారులకు పంపుతాం. దీనిపై విద్యుత్ వినియోగదారులతో మాట్లాడాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో లైన్‌మెన్ అశోక్‌పై చర్యలు తీసుకుంటాం.
– సుమన్, ట్రాన్స్‌కో ఏఈ

'బస్సు జాతా' జయప్రదం చేయండి



వనపర్తి రూరల్: ఈనెల 23న ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే బస్సుజాతాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రాష్ట్ర బస్సు జాతా సోమవారం జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా ఆశాలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా కల్పించాలని, అదనపు పనులకు అదనపు వేతనం వంటి డిమాండ్ల సాధనకు ఆశా వర్కర్లు బస్సు జాతా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో రమేష్, ఆశా వర్కర్ల సంఘం నాయకులు బుచ్చమ్మ, శివమ్మ, లలిత, సునీత, శ్యామల, భాగ్య, సంతోషమ్మ పాల్గొన్నారు.
పాన్‌గల్: తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రాష్ట్ర బస్సు జాతా సోమవారం జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా ఆశాలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశ రాము ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీకి కేజీబీవీ విద్యార్థిని ఎంపిక


ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఇంగ్లిష్ మీడియం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 19న వనపర్తిలో నిర్వహించిన జూనియర్ కబడ్డీ జట్టు ఎంపికలో పాఠశాలకు చెందిన విద్యార్థిని పూజ ఎంపికైందని ప్రత్యేక అధికారి లలిత, పీఈటీ చిట్టి తెలిపారు.

పశువుల కాళ్లకు రక్షణ తొడుగులు


ఆత్మకూర్: పశువులకు రక్షణ కల్పించేందుకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పశువులు నడకలో ఇబ్బందులు కలుగకుండా, ముళ్లు గుచ్చుకోకుండా కాళ్లకు ఇనుప తొడుగులను బిగిస్తున్నారు. ఆదివారం ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్లలో ఎద్దుల కాళ్లకు ఇనుప తొడుగులు ఏర్పాటు చేయించారు. ఇందుకు ఒక్కో ఎద్దుకు రూ.600 చెల్లించినట్లు రైతులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ


ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధిలో పెద్దమ్మ తల్లి ఆలయ పునఃనిర్మాణానికి నిర్వాహకులు ఆదివారం విరాళాలు సేకరించారు. వందల ఏళ్ల క్రితం నిర్మించిన పెద్దమ్మ ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో పునర్నిర్మాణానికి స్థానికులు పూనుకున్నారు. ఇందుకు గాను రూ.2 కోట్లు అవసరమని కావడంతో ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.4.50 లక్షల వరకు విరాళాల రూపంలో వసూలు అయ్యాయని నిర్వాహకులు తెలిపారు. జనవరి 18వ తేదీన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు బాలకృష్ణ, రవీందర్, బాలు, కురుమూర్తి, నాగేష్, గోపాల్, శివ, అరవింద్, చిన్న తదితరులు ఉన్నారు.

అపూర్వ సమ్మేళనం


మదనపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1973–74 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత స్నేహితులందరూ ఒకే చోట కలుసుకోవడంతో ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులు లతీఫ్, వీరన్న, జగన్మోహన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, సత్యం, లక్ష్మీకాంత్‌రెడ్డి, దేవదానం, గులాం అహ్మద్, పరమేశ్వర్, ప్రకాష్, సత్య నారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, మనోహర్, యాదమ్మ, వెంకటేశ్వరమ్మ, కౌసల్య, సావిత్రి, సుజాత పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి

పాన్‌గల్: మండలంలో ప్రజలు తీర్థయాత్రలు, శుభ కార్యాలయాలకు, పండుగలకు ఇంటికి తాళం వేసి వెళ్తున్నట్లయితే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు ఇంటికి గట్టి తాళాలు వేసుకోవాలన్నారు. పోలీసులకు సమాచారం ఇస్తే ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో హోటల్ దగ్ధం


వనపర్తి: జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల రోడ్డులో గల గ్రాడ్యుయేట్ అడ్డా అనే హోటల్‌లో ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. హోటల్ నిర్వాహకుడు భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్వెటర్ వద్ద అకస్మాత్తుగా మంటలు రావడంతో హోటల్‌లోని వారిని బయటకు పంపించామన్నారు. అనంతరం అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయగా.. వారు ఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలు ఆర్పివేశారు. అప్పటికే సామగ్రితో పాటు మ్యాట్ కాలిపోగా సుమారు రూ. 40 వేల ఆస్తినష్టం జరిగినట్లు అగ్నిమాపకశాఖ అధికారి నరసింహారెడ్డి తెలిపారు.

'కేరళ ప్రజలకు అండగా నిలబడదాం'


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి

వనపర్తిరూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న వామపక్ష ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ కేరళ ప్రజలకు అండగా నిలబడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కేరళ ప్రభుత్వానికి సంఘీభావ జిల్లా సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కేరళ వామపక్ష ప్రభుత్వాన్ని ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేసే కుట్రకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందని, దీనిని దేశ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. కేరళ ప్రభుత్వం విద్య, వైద్యం, మతసామరస్యాన్ని కాపాడటంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్రానికి చట్టపరంగా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వడం లేదని, ఇది సమైక్య స్ఫూర్తికి విరుద్ధమని దుయ్యబట్టారు. గవర్నర్‌ను అడ్డుపెట్టుకొని శాసనసభ హక్కుల్ని ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాజు, రమేష్, కుర్మయ్య, దేవేందర్, మదన్, వెంకటయ్య, బాలస్వామి, రాములు, బిసన్న, గట్టయ్య, విజయలక్ష్మి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ఆత్మకూర్: న్యూమాంగ్స్ కుంగ్‌ఫూ సౌత్‌ఇండియా పోటీల్లో ఆత్మకూర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి చాంపియన్‌షిప్ సాధించారని కరాటే మాస్టర్ నరేందర్ తెలిపారు. ఆదివారం షాద్‌నగర్‌లో రతన్‌టాటా మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆత్మకూర్‌కు చెందిన అరవింద్ చాంపియన్‌షిప్ సాధించడంతో పాటు గోల్డ్ మెడల్‌ను సాధించగా.. రమ్యశ్రీ, శ్రీలేఖ, ఇంతియాజ్ సిల్వర్ మెడల్, సోహెల్ బ్రౌన్ మెడల్‌ను సాధించారు. నటుడు బిత్తిరి సత్తి, సీనియర్ మాస్టర్లు కనకంయాదవ్, బాలరాజు, తాజుద్దీన్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్లు రహ్మతుల్లా, అమర్, శివ, రాము, స్థానికులు అభినందించారు.

నేటి నుంచి పల్లెల్లో ఉర్సు



అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లి గ్రామంతో పాటు నాగల్‌కడ్మూర్, ధర్మాపురం గ్రామాల్లో వెలసిన శ్రీసయ్యద్‌షా మహాబూబ్ ఉస్సేనీ దర్గా షరీఫ్ ఉర్సు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఆదివారం రాత్రి గంధోత్సవాన్ని ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం దర్గా వద్ద భక్తులు కందూర్‌లను నిర్వహించి తమ తమ మొక్కులను చెల్లించుకుంటారని తెలిపారు. ఉర్సు సందర్భంగా దర్గా షరీఫ్‌లను విద్యుత్ బల్బులతో అలంకరించారు. వివిధ గ్రామాల్లో స్థిరపడిన ఆయా గ్రామస్తులు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. భక్తిశ్రద్ధలతో దర్గాలో భక్తులు చాదర్లను సమర్పిస్తుంటారు. దర్గా సందర్శనకు వస్తున్న భక్తులకు సౌకర్యాలను కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

'హెల్మెట్ ధరించడం సురక్షితం'


హెల్మెట్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

వనపర్తి రూరల్: నిరంతరం బైక్‌పై ప్రయాణం చేసేవారు తలకు హెల్మెట్ ధరించడమే శ్రీరామరక్ష అని డీఎస్పీ వెంకటేశ్వరావు అన్నారు. ఆయన ఆదివారం వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెల్మెట్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని సీఐ కృష్ణయ్య, ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి, బాలయ్యతో కలిసి విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిత్యం ప్రయాణంలో అనుకోకుండా జరుగుతున్న బైక్ ప్రమాదాల్లో తలకు హెల్మెట్ లేకపోవడంతో మృతి చెంది ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం స్టేషన్‌కు వస్తున్న ప్రజల అవగాహన కోసం ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి, వారి బృందం హెల్మెట్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. వాటితో పాటు స్టేషన్ ఆవరణలో ప్రజలు కూర్చోవడానికి సైడ్‌వాల్స్ నిర్మించడం, స్టేషన్ అభివృద్ధి కోసం అతను చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేష్‌గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రుక్కన్నపల్లిలో రక్తదాన శిబిరం ఏర్పాటు


రక్తదానం చేస్తున్న యువత, పాల్గొన్న ఎస్‌ఐ తదితరులు

ఖిల్లాఘనపురం: యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి అపాయంలో ఉన్న వ్యక్తుల ప్రాణాలు కాపాడాలని ఎస్‌ఐ సురేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని రుక్కన్నపల్లిలో వాల్మీకి యువజన సంఘం వారు యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో నిత్యం ఎంతో మంది గర్భిణులు, రక్తహీనత ఉన్న వ్యక్తులు, డయాలసిస్, క్యాన్సర్, తలసేమియా, డెంగీ లాంటి వ్యాధులతో బాధపడుతూ, ప్రమాదాలు జరిగినప్పుడు రక్తం కోసం ఇబ్బందులు పడుతుంటారన్నారు. కొన్ని సందర్భాల్లో రక్తం దొరకకపోవడంతో ప్రాణాలు పోయిన ఘటనలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాల్మీకి సంఘం యువత ముందుకు వచ్చి రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడంపై హర్షం వ్యకతం చేశారు. శిబిరంలో మొత్తం 30 యూనిట్ల రక్తాన్ని సేకరించి వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి అందించామని వాల్మీకి యువజన సంఘం అధ్యక్షుడు కుర్మయ్య తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నవీన్, వాల్మీకి సంఘం సభ్యులు సంతోష్, నరేష్‌నాయక్, అంజనేయులు, మాసయ్య, భీమయ్య, తిరుపతి, రాములు, యాదయ్య, అబ్దుల్ ఖాదర్, రాములు, స్వామి ఉన్నారు.

కాజ్‌వే నిర్మించండి


దంతనూరు ఊకచెట్టు వాగులో కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద (ఫైల్)

మదనాపురం: మండలంలోని దంతనూరు, శంకరమ్మపేట గ్రామాల మధ్య ఊకచెట్టు వాగుపై కాజ్‌వేను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలంలో శంకరసముద్రానికి వరద నీరు పోటెత్తుంది. రిజర్వాయర్ నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో ఊకచెట్టు వాగులో వరద తాకిడి పెరుగుతోంది. దీంతో దంతనూరు, శంకరమ్మపేట గ్రామాల మధ్య ఊకచెట్టు వాగులో నిర్మించిన లోలెవల్ వంతెనపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఐదేళ్లుగా ఈ పరస్థితి కొనసాగుతోంది. వాగుకు రెండు వైపులా ఉన్న పంట పొలాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సరళాసాగర్ ప్రాజెక్టు వెళ్లాలంటే చుట్టూ తిరిగి కొత్తకోట మండలం పాలెం మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి వచ్చే వర్షాకాలం నాటికి కాజ్‌వే నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ గ్రామసభ


ఉపాధి పనులపై చర్చిస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌లో ఉపాధి పనుల సామాజిక తనిఖీపై ఆదివారం గ్రామసభ నిర్వహించారు. 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి గ్రామంలో ఏప్రిల్ 2023 నుంచి, 31 మార్చి 2024 వరకు ఉపాధి పనుల్లో రూ.43 .96 లక్షలకు సంబంధించిన పనులపై, చేసిన ఖర్చుపై గ్రామసభలో పనుల వారీగా చర్చించి, అభ్యంతరాలను నమోదు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ సిబ్బంది పేర్కొన్నారు.

నేడు గ్రామసభలు ఉన్న గ్రామాలు

ఉపాధి పనుల సామాజిక తనిఖీపై సోమవారం మండలంలోని గోప్లాపూర్, రేమద్దుల, తెల్లరాళ్లపల్లి తండా, చిక్కేపల్లి, మల్లాయిపల్లి, మాందాపూర్, దావాజిపల్లి గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ కుర్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దామచెరువు పరిసరాల్లో కంపచెట్లు తొలగించాలి


కాలనీ సమీపంలో చెరువు పరిసరాల్లో ఏపుగా పెరిగి కంప చెట్లు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న దామ చెరువు పరిసరాల్లో ఏపుగా పెరిగిన కంప చెట్లను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీ సమీపంలో ఉన్న దామ చెరువు పరిసరాల్లో కంప చెట్లు ఏపుగా పెరగడం, మురుగునీరు, చెత్తాచెదారం చెట్ల సమీపంలో నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు, ఈగలు వ్యాప్తితో రోగాలు సంభవించే అవకాశం ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో పాటు చెరువు నీరు కాలనీకి అతి సమీపంలో ఉండటం, కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉండటంతో కాలనీలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కంపచెట్లు తొలగించి కాలనీ వరకు చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో టీయూసీఐ ఆధ్వర్యంలో జిల్లా రెండో మహాసభను నిర్వహించారు. వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, నెలనెలా బిల్లులు చెల్లించాలని, గుడ్డు బిల్లులు ఇవ్వాలని, గుడ్డు ధరను రూ.5 నుంచి రూ.7కు పెంచాలని, వంటపాత్రలు, గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లానూతన కార్యవర్గం ఏర్పాటు

మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా గీతాబాయి, అధ్యక్షురాలిగా గోవిందమ్మ, ఉపాధ్యక్షుడిగా నాగమ్మ, ప్రధాన కార్యదర్శిగా హేమలత, సహాయకార్యదర్శిగా బుచ్చన్న, కోశాధికారిగా రంగన్న, సభ్యులుగా పరమేష్, నిర్మల, బాలస్వామి, సంధ్య, బలరాం, నాగమ్మ, చాంద్‌బీ ఎన్నుకున్నారు.



అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి


మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్‌యాదవ్

వనపర్తి టౌన్: ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిషాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ల క్రితమే దేశానికి మార్గదర్శకంగా ఉండే రాజ్యాంగానికి రూపకల్పన చేసిన డాక్టర్ అంబేడ్కర్‌ను నిండు పార్లమెంట్‌లో అవమానించి మాట్లాడిన అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని, ఇప్పటి వరకు బీఆర్ఎస్ నాయకులు ఈ అంశం పైన ఖండించలేదని మండిపడ్డారు. పీసీసీ పిలుపు మేరకు సోమవారం ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, అన్ని మండల, పట్టణ అధ్యక్షులు, మార్కెట్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, కార్యవర్గం, ప్రజాప్రతినిధులు వారి కేంద్రంలో ఈ అంశంపై సమావేశాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా మంగళవారం ఉదయం 10గంటలకు అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ ద్వారా రాష్ట్రపతి పేరు మీద వినతిపత్రం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ సమద్, కోళ్ల వెంకటేష్, రాగి వేణు, జానకీరాములు, మధుసూదన్‌రెడ్డి, గద్దం వినోద్, నందిమల్ల సందీప్, వెంకట్, నరేష్, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


జిల్లా కేంద్రంలోని హెబ్రోన్ చర్చిలో వేడుకలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

వనపర్తి టౌన్: పట్టణ కేంద్రంలోని మారెమ్మ కుంట హెబ్రోన్ చర్చి నందు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి క్రైస్తవులకు, వనపర్తి జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విశ్వంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గద్వాల ఆంజనేయులు మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ మార్గం నందు ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి విగ్నేశ్వర చారి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు గొర్ల శైలన్‌కుమార్, కేశపోగు సామేల్ పాల్గొన్నారు.

ప్రత్యేకారాధన ఉత్సవాలు


ఆత్మకూర్ చర్చిలో కేక్ తినిపిస్తున్న పాస్టర్ జర్మియా

ఆత్మకూర్: పట్టణంలోని బెత్లెహెం ఎంబీ చర్చిలో ఆదివారం పరిశుద్ధ దినంగా ప్రత్యేకారాధన ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రేవా సీఏ జర్మియా ఆధ్వర్యంలో బైబిల్ సూక్తులను వినిపించి ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి క్రైస్తవులకు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు.